


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 17-07-2026 | సంపుటి - 29 | సంచిక - 55 | రూ : 4 | పేజీలు: 8




## సీతారామను పూర్తి చేస్తాం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్టు బీఆర్ఎస్ నేతల డ్రామాలు : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి : గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల తరువాయి 2లో



## లక్ష మంది సామర్థ్యంతో 'ఫ్యూచర్'లో స్టేడియం



- టీజీ20కి ఐపీఎల్ స్థాయి గుర్తింపు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌కు అభినందన
- యువ క్రికెటర్లు సచిన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచన

**హైదరాబాద్, 16 జూలై :** గ్రామీణ ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకు రావడానికి టీజీ20 లీగ్ మంచి వేదిక అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణలో తొలిసారిగా టీజీ20 లీగ్ జరిగింది. ఈనాడు సంస్థ ప్రోత్సహించడమంటే ఆటగాళ్లకు వెయ్యేనుగుల బలం వచ్చినట్లే. అలాంటి సంస్థ అండగా నిలవడంతో ఈ లీగ్‌కు దాదాపుగా ఐపీఎల్ స్థాయి గుర్తింపు లభించింది' అని ప్రస్తుతించారు. రాష్ట్రంలోని యువ ఆటగాళ్లను ప్రోత్సహించడానికి ఫ్యూచర్ సిటీలో లక్ష మంది సామర్థ్యంతో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు బీసీసీఐ, హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ)తో చర్చిస్తున్నట్లు చెప్పారు. టీజీ20 మొదటి సీజన్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌ను సీఎం రేవంత్ అభినందించారు. గురువారం ఎంసీహెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు మేనేజ్‌మెంట్‌ను ఆయన సత్కరించారు. రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేశ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఉషాకిరణ్ మూవీస్ డైరెక్టర్ బాపినీడు, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, కెప్టెన్ అభిరథ్‌రెడ్డి, చీఫ్ కోచ్ అనిరుధ్‌సింగ్‌తో పాటు జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి 'ఈనాడు' ప్రకటించిన రూ.1 కోటి నగదు ప్రోత్సాహకాల్ని సీఎం రేవంత్ అందజేశారు. తరువాయి 2లో



### గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు..

## ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా తరువాయి 2లో

### మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?..

## కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు



- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం 2లో

### నీట్ యూజీ 2026..

## రీ-ఎగ్జామ్ ఫలితాలు విడుదల

### 11.21 లక్షల మంది అర్హత



- పేపర్ లీక్ కారణంగా నీట్ యూజీ రీ ఎగ్జామ్ నిర్వాహణ
- నేడు ఫలితాలు విడుదల
- పంజాబ్, హర్యానాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు 720కి 715 మార్కులు
- ఫలితాలకు ముందు తుది ఆన్సర్ కీని కూడా రిలీజ్ చేసిన ఎన్టీఏ
- అక్రమాల ఆరోపణలతో మే 3న జరిగిన పరీక్ష రద్దు

2లో

## ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ



- ఇంధన రంగ నిపుణుడైన కోరెట్స్కీని ఎంపిక చేసిన జెలెన్స్కీ
- కోరెట్స్కీ నియామకానికి ఆమోదం తెలిపిన ఉక్రెయిన్ పార్లమెంట్
- రక్షణ దళాల బలోపేతం, శీతాకాల సన్నద్ధతే ప్రధాన లక్ష్యాలు



## భారత రైల్వేలో నవశకం..

### నేడు పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

- మొట్టమొదటి హైడ్రోజన్ రైలును శుక్రవారం ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- హర్యానాలోని జింద్-సోనిపట్ మార్గంలో పైలట్ ప్రాజెక్టుగా సేవలు
- చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో దేశీయంగా ఈ రైలు అభివృద్ధి

2లో

# లక్ష మంది సామర్థ్యంతో 'ఫ్యూచర్'లో స్టేడియం

హైదరాబాద్: గ్రామీణ ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకురావడానికి టీజీ20 లీగ్ మంచి వేదిక అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణలో తొలిసారిగా టీజీ20 లీగ్ జరిగింది. ఈనాడు సంస్థ ప్రోత్సహించడమంటే ఆటగాళ్లకు వెయ్యేనుగుల బలం వచ్చినట్లే. అలాంటి సంస్థ అండగా నిలవడంతో ఈ లీగ్‌కు దాదాపుగా ఐపీఎల్ స్థాయి గుర్తింపు లభించింది' అని ప్రస్తుతించారు. రాష్ట్రంలోని యువ ఆటగాళ్లను ప్రోత్సహించడానికి ఫ్యూచర్ సిటీలో లక్ష మంది సామర్థ్యంతో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు బీసీసీఐ, హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ)తో చర్చిస్తున్నట్లు చెప్పారు. టీజీ20 మొదటి సీజన్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌ను సీఎం రేవంత్ అభినందించారు. గురువారం ఎంసీహెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు మేనేజ్‌మెంట్‌ను ఆయన సత్కరించారు. రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేశ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఉషాకిరణ్ మూవీస్ డైరెక్టర్ బాపినీడు, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, కెప్టెన్ అభిరథ్‌రెడ్డి, చీఫ్ కోచ్ అనిరుధ్‌సింగ్‌తో పాటు జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి 'ఈనాడు' ప్రకటించిన రూ.1 కోటి నగదు ప్రోత్సాహకాల్ని సీఎం రేవంత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

*** పతకం సాధిస్తే నగదు బహుమతి.. ఉద్యోగం నేరుగా వచ్చేస్తాయ్**

"యువ క్రికెటర్లు సచిన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. సచిన్, సునీల్ గావస్కర్, ధోని, విరాట్ కోహ్లీ లాంటి ఆటగాళ్లు క్రికెట్ పట్ల చూపించిన గౌరవం, అంకితభావం వల్లే చరిత్రలో నిలిచిపోయారు. 1999 నుంచి 2004 వరకు హైదరాబాద్‌లో జాతీయ క్రీడలు, ఆఫ్రోఆసియా క్రీడలు సహా ప్రతిష్ఠాత్మక పోటీలు జరిగాయి. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో భారత్‌కు నాలుగో స్థానం వచ్చినప్పుడు కూడా హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం ఉండేది. గత కొంతకాలంగా హైదరాబాద్ క్రీడలకు దూరమైంది. మా ప్రభుత్వం వచ్చాక క్రీడలపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. అద్భుతమైన క్రీడా విధానాన్ని తీసుకొచ్చాం. ప్రతిభావంతులు, పతక విజేతలు ఎవరి దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదు. పతకం సాధిస్తే నగదు బహుమతి, ఉద్యోగం నేరుగా వచ్చేస్తాయి. క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు విద్యార్హతలు లేకపోయినా నిబంధనల్ని సడలించి డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూపు 1, జీవాంజి దీప్తికి గ్రూపు 2 ఉద్యోగాలు అందించాం. ఇషా సింగ్‌కు రూ.3 కోట్ల నగదు బహుమతి ఇచ్చాం. క్రీడల్లో రాణించే వారికి రివార్డులతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. స్పోర్ట్స్ యూనివర్సిటీని పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అత్యాధునిక వసతులతో పునరుద్ధరిస్తున్నాం. రెండేళ్లలో ఒలింపిక్ ప్రమాణాలతో అకాడమీని, శిక్షణ కేంద్రాన్ని అన్ని వసతులతో అందుబాటులోకి తెస్తాం.

*** కొంచెం గుర్తింపు రాగానే ఏకాగ్రత కోల్పోకూడదు**



ఏ వృత్తిలో అయినా ఏకాగ్రత చాలా ముఖ్యం. చేసే పని పట్ల గౌరవం ఉన్నప్పుడే రాణిస్తారు. కొంచెం గుర్తింపు రాగానే ఏకాగ్రత కోల్పోకూడదు. ముఖ్యంగా క్రికెట్లో సెలబ్రిటీ హోదా రాగానే ఆట వెనక్కిపోయి ఇతర విషయాలు ముందుకొస్తాయి. మైదానంలో రాణించాలంటే దేహానికి సరైన విశ్రాంతి అవసరం. రాత్రిపూట సరైన నిద్రలేకపోతే మైదానంలో పరుగెత్తలేరు. జట్టు గెలిచినా, ఓడినా వ్యక్తిగత ప్రతిభను చాటుకోవడానికి సువర్ణావకాశం. తెలంగాణలోని యువ క్రికెటర్లంతా దేశ ప్రతిష్ఠను పెంచే గొప్ప క్రీడాకారులుగా తయారవుతారని ఆశిస్తున్నా" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## సీతారామను పూర్తి చేస్తాం

సత్తుపల్లి : గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనానికి నష్టం కలిగించారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రూపొందించారని, వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామనీ, అవసరమైన బిల్లులను సిద్ధం చేసి వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు.

*** లక్షలాది ఎకరాలకు సాగునీరందించినట్టు ప్రచారం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించినట్టు బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాల అనుమతులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్ట్‌లు నిర్వహించకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ సమస్యలు తలెత్తాయన్నారు. మిగిలిన బ్యారేజీల భద్రతపై కూడా నిపుణుల సూచనలు ఉన్నాయనీ, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో ప్రభుత్వం నిర్ణయించిన విధానం ప్రకారం వేగంగా పరిహారం చెల్లింపులు చేస్తామని, అధికారులు ఈ అంశాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు.

*** కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి పొంగులేటి**

కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రారంభించిన అన్ని నీటిపారుదల పనులను నిజాయితీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్, వైరా-లంకసాగర్ ప్రాజెక్టులు, ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా సాధ్యమైనంత మేరకు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్ బాబు, బాగం నీరజదేవి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సీఈలు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ యుగంధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ యూజీ 2026 రీఎగ్జామ్ ఫలితాలు విడుదల

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గురువారం ప్రకటించింది. ఈ పరీక్షలో మొత్తం 11.21 లక్షల మంది విద్యార్థులు మెడికల్ అడ్మిషన్లకు అర్హత సాధించారు. మే 3న జరిగిన అసలు పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకు చెందిన పాన్షుల్ బన్సల్ ఇద్దరూ 720కి 715 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టినతేదీ లేదా పాస్‌వర్డ్‌తో అధికారిక వెబ్‌సైట్ neet.nta.nic.inలో లాగిన్ అయి స్కోర్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫలితాల విడుదలకు కొన్ని గంటల ముందు రీఎగ్జామ్‌కు సంబంధించిన తుది ఆన్సర్ కీని కూడా ఎన్టీఏ విడుదల చేసింది. అర్హత సాధించిన వారిలో 58 శాతానికి పైగా మహిళా అభ్యర్థులే ఉన్నారని ఎన్టీఏ తెలిపింది. టాపర్లలో అత్యధికులు 17 నుంచి 19 ఏళ్ల వయసు వారే ఉన్నారు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడుతో పాటు తెలంగాణ నుంచి కూడా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఫలితాలను సకాలంలో ప్రకటించడం వల్ల మెడికల్ అడ్మిషన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సజావుగా కొనసాగించడానికి వీలవుతుందని ఎన్టీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యార్థుల సౌలభ్యం కోసం స్కాన్ చేసిన ఓఎంఆర్ షీట్లు, స్కోర్‌కార్డులను డిజిలాకర్‌లో కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు..

(మొదటిపేజీ తరువాయి)

వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

## ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

రష్యాతో భీకర యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఉక్రెయిన్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ నూతన ప్రధానమంత్రిగా ఇంధన రంగ నిపుణుడు సెర్హీ కోరెట్స్కీ నియమితులయ్యారు. ఆయన నియామకానికి ఉక్రెయిన్ పార్లమెంట్ గురువారం ఆమోదముద్ర వేసింది. దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, ఈ రంగానికి చెందిన అనుభవజ్ఞుడికి ప్రధాని పగ్గాలు అప్పగించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధాని యూలియా స్విరిడెంకో తన పదవికి రాజీనామా చేయగా, ఆమె స్థానంలో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ 'నాఫ్టోగాజ్' సీఈఓగా పనిచేస్తున్న సెర్హీ కోరెట్స్కీ పేరును జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనను ఆమోదించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన తర్వాత ఉక్రెయిన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడో వ్యక్తిగా కోరెట్స్కీ నిలిచారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కోరెట్స్కీ తన ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. "ఉక్రెయిన్ రక్షణ దళాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడం, రక్షణ పరిశ్రమల అభివృద్ధిని వేగవంతం చేయడం, రాబోయే శీతాకాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం మా ప్రథమ కర్తవ్యం" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వీటితో పాటు సామాజిక బాధ్యతలను నెరవేర్చడం, యూరోపియన్ యూనియన్‌లో చేరే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. 48 ఏళ్ల కోరెట్స్కీకి ఇంధన రంగంలో అపార అనుభవం ఉంది. అయితే, ఆయనకు గతంలో ఎలాంటి రాజకీయ పదవుల అనుభవం లేదు. రష్యా దాడుల నడుమ దేశ ఇంధన స్థిరత్వాన్ని కాపాడటంలో నాఫ్టోగాజ్ సీఈఓగా ఆయన కీలక పాత్ర పోషించారు.

## భారత రైల్వేలో నవశకం.. నేడు పట్టాలెక్కనున్న తొలి హైడ్రోజన్ రైలు

భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై 17న ప్రారంభించనున్నారు. హర్యానాలోని 89 కిలోమీటర్ల జింద్‌సోనిపట్ మార్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. పర్యావరణ హిత రవాణా దిశగా భారత రైల్వే వేసిన ఈ అడుగు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ హైడ్రోజన్ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) అభివృద్ధి చేసింది. డీజిల్ ఇంజిన్‌తో నడిచే డెమూ రైలును ఆధునికీకరించి, ఇందులో 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సిస్టమ్‌ను అమర్చారు. ఈ సాంకేతికతలో హైడ్రోజన్, ఆక్సిజన్ కలయికతో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. కేవలం నీటి ఆవిరి మాత్రమే వ్యర్థంగా వెలువడటం వల్ల పర్యావరణ



కాలుష్యానికి తావు ఉండదు. పది కోచ్‌లు కలిగిన ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. ఇందులో సుమారు 2,600 మంది ప్రయాణించే వీలుంది. టికెట్ ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండేలా రూ. 5 నుంచి రూ. 25 మధ్య నిర్ణయించారు. జింద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక హైడ్రోజన్ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా ఇంధనాన్ని సరఫరా చేస్తారు. ఇప్పటికే అన్ని రకాల భద్రతా పరీక్షలను పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పాఠశాల విద్యార్థులతో కలిసి కొంత దూరం ప్రయాణించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే, దేశవ్యాప్తంగా మరో 35 హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ యోచిస్తోంది.

# ఆగస్టు 3లోగా సర్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేసేందుకు చర్యలు

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆగస్టు 3 లోగా 100 శాతం పూర్తి చేయాల్సి ఉందని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు.గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ ప్రక్రియ పురోగతిపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఓటర్లకు 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 78 శాతం మ్యాపింగ్, డిజిటలైజేషన్ పూర్తయిందని, రానున్న నాలుగు నుంచి 5 రోజుల్లో దీనిని 92 శాతానికి పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం సర్ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో ఈ లోగా 100 శాతం మ్యాపింగ్, డిజిటలైజేషన్ పూర్తి చేసేలా అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ప్రతినిధులకు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేసి, వాటిని పూరించడంలో ప్రజలకు సహాయం చేస్తున్నారని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 10లక్షల మ్యాపింగ్‌లు పూర్తయ్యాయని, ఇంకా 54 వేల మ్యాపింగ్‌లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇంకా 344 ఓట్లు గుర్తించాల్సి ఉందని తెలిపారు. బుధవారం నాటికి పెండింగ్ మ్యాపింగ్ పూర్తి



చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియ పూర్తైతే డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల ఓట్లను కూడా ఇంటింటికి వెళ్లి నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి క్వాలిటీ అధికారులను నియమించి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని, మరో 5 రోజుల్లో జిల్లాలో 92 శాతం మ్యాపింగ్ పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో బీఎల్‌వోలు సమర్థవంతంగా పనిచేస్తూ మ్యాపింగ్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారని అభినందించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నుండి ముంతాజ్ అలీ, బిఆర్ఎస్ తరఫున బక్క పిచ్చయ్య, బిజెపి నుండి లింగస్వామి, ఆప్ ఆద్మీ తరఫున అన్సారి, సిపిఎం నర్సిరెడ్డి, టిడిపి నుండి అన్నా రవి ,ఎన్సీపీనుండి రఫీ , బిఎస్పి తరఫున రవిశంకర్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ

*** జిల్లా కలెక్టర్,డీఈఓ కు టి యుడబ్ల్యూ జే ( ఐ జే యు ) జిల్లా కమిటీ కృతజ్ఞతలు**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ జిల్లాలోని జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు పాఠశాల విద్యలో 50 ఫీజు రాయితీని కల్పిస్తూ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు గురువారం నాడు జిల్లా విద్యాశాఖ అధికారి సుశేందర్ రావు సర్క్యులర్ జారీ చేశారు. టీయూడబ్ల్యూజే ( ఐజేయు) నల్లగొండ జిల్లా కమిటీ విజ్ఞప్తి మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్క్యులర్ ను అందజేశారు . ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్క్యులర్ జారీ చేసి ఎంతోమంది మధ్యతరగతి కుటుంబాలకు చెందిన జర్నలిస్ట్ కుటుంబాల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించినందుకు జిల్లా కలెక్టర్ కు,డిఇఓ కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యజమాన్యాలు ఈ సర్క్యులర్ ఆధారంగా ఫీజు రాయితీని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టియుడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పరమేష్, కార్యదర్శి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా వీడియో జర్నలిస్టు జిల్లా అధ్యక్షుడు సలీం,యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా యాదయ్య, నాయకులు, జర్నలిస్టులు అశోక్, ఊర రమేష్, దేవరకొండ యాదగిరి, టి. దశరథ లతీఫ్, ముచ్చర్ల శ్రీనివాస్, కంది వేణు తదితరులు పాల్గొన్నారు.

# 20 లీటర్ల గుడుంబా స్వాధీనం

*** ఇద్దరు మహిళల అరెస్టు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి పట్టణంలో అక్రమంగా గుడుంబా తరలిస్తున్న ఇద్దరు మహిళలను పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం తయారీ, రవాణాపై చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం భూపాలపల్లి సీసీఎస్ బృందం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్‌వ్యాలీ స్కూల్ వెనుక ప్రాంతంలో తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా అక్రమంగా గుడుంబా తరలిస్తున్న అజ్మీరా రాజిత (40), నంగావత్ పార్వతి (38) లను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న సుమారు 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుంది. నిందితులను, స్వాధీనం చేసుకున్న గుడుంబాతో పాటు తదుపరి చట్టపరమైన చర్యల కోసం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీసులు హెచ్చరించారు.

# బ్రిడ్జి నిర్మాణ పు పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

*** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండలం సంగెం-బోలేపల్లి గ్రామాల మధ్య మూసి నదిపై 42 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సంగెం హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారంభువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభంఅనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. పనుల ప్రారంభానికిముందు భీమలింగం కట్ట వద్ద శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, న అనంతరం కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సంగెం, బోలేపల్లి చౌటుప్పల్ పోచంపల్లిగ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అన్ని కాలాల్లో సురక్షితమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సుమారు రూ.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ బ్రిడ్జికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరిపాలనా ఆమోదం తెలుపుతూ నిధులు మంజూరు చేశారని అన్నారు. రాష్ట్ర రోడ్లు & భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవతో పనులు ప్రారంభమయ్యేలా సహకరించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేకంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి బ్రిడ్జి నిర్మాణ పు పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు బ్రిడ్జి పూర్తయ్యాక ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా చూస్తామని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి వివరించారు అదేవిధంగా భువనగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్&బి ఈ ఈసరితారాణి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి వాణి రవికుమార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి నాయకులు బత్తిని లింగయ్య చిట్టెడి జనార్దన్ రెడ్డి చెరుకు శివయ్య గౌడ్ పోత్నాక్కు ప్రమోద్ కుమార్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు బద్దం సంజీవరెడ్డి బాతరాజు బాల నరసింహ చిలుకూరు సత్తిరెడ్డి బెలిదే నాగేశ్వర్ పలుసం సతీష్ గౌడ్ వంగాల అశోక్ గౌడ్ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు, గ్రామస్తులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే గండ్ర ఆరోపణలు: బీజేపీ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : సింగరేణి భరోసా యాత్రపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేస్తున్న ఆరోపణలు రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి విమర్శించారు. భూపాలపల్లిలోని బీఎంఎస్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టారని, తాడిచెర్ల-1 బొగ్గు బ్లాక్‌ను వినియోగించకుండా చేసి సంస్థకు నష్టం కలిగించారని ఆరోపించారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చొరవతో వేలం లేకుండానే తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడంతో పాటు ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌కు అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలు, మెడికల్ బోర్డులు, డిపెండెంట్ ఉద్యోగాలు, ఖాళీల భర్తీ వంటి అంశాలను ఎందుకు పరిష్కరించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి భరోసా యాత్ర రాజకీయాల కోసం కాదని, కార్మికుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే బాధ్యతాయుత కార్యక్రమమని స్పష్టం చేశారు. బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, మెడికల్ బోర్డులు, డిపెండెంట్ ఉద్యోగాలు, ఖాళీల భర్తీ వంటి అంశాలపై బీఎంఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కల్పించేందుకు ర్యాలీ ,మానవహారం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లాలో 2026 నాటికి దాదాపు 18 లక్షల జనాభా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పెరుగుతున్న జనాభా వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి, సహజ వనరులపై పడే ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మానవహారంలో ఈ సంవత్సరపు నినాదమైన "ప్రణాళిక బద్ధమైన కుటుంబం - ఆరోగ్యవంతమైన సమాజం - అభివృద్ధి చెందిన దేశం" అనే అంశంపై డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ పద్ధతులను స్వచ్ఛందంగా అవలంబించడం ద్వారా తల్లి, శిశు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి, సమాజ ప్రగతికి దోహదపడుతుందని వివరించారు. అనంతరం లైన్‌వాడకు చెందిన ప్రత్యూష భర్త ఆకాశ్ ఇద్దరు పిల్లల అనంతరం కుటుంబ నియంత్రణలో భాగంగా (ఇంట్రా యూటరైన్ డివైస్) పద్ధతిని స్వీకరించగా, వారిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ దీప, డాక్టర్ కృష్ణకుమారి డాక్టర్ పద్మ (డాక్టర్ జమీర్, డాక్టర్ తిరుపతిరావు ఇతర జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తాడిచెర్ల-2 బ్లాక్ విజయోత్సవాలు




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): సింగరేణి సంస్థకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న తాడిచెర్ల2 బ్లాక్ సాధన విజయోత్సవాలను గురువారం భూపాలపల్లి ఏరియాలో ఘనంగా నిర్వహించారు. కేటీకే ఓసీ2 ఉపరితల గనిలో జరిగిన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజయోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడిచెర్ల 2 బ్లాక్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో కలిసి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, తాడిచెర్ల 2 బ్లాక్ సాధన సింగరేణి భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని తెలిపారు. ఉత్పత్తి, భద్రత, నాణ్యతలో మరిన్ని విజయాలు సాధించే దిశగా అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టును సింగరేణికి నేరుగా కేటాయించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గని ద్వారా భూపాలపల్లి ఏరియాలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులకు కరపత్రాలను పంపిణీ చేసి మిఠాయిలు పంచారు. తాడిచెర్ల2 బ్లాక్ సాధనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ ఇది సింగరేణి చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. భూపాలపల్లి ఏరియాలోని అన్ని ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనులు, ఏరియా కార్యాలయాలు, వివిధ విభాగాల్లో కూడా విజయోత్సవాలు నిర్వహించి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏజీఎంలు రవికుమార్, జ్యోతి, పీఓ శ్యాంసుందర్, డీజీఎం (ఎఫ్&ఏ) పి. రాజేశ్వర్, ఏరియా సర్వే ఆఫీసర్ శైలేంద్ర కుమార్, గ్రూప్ పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఏఐటీయూసీ అసిస్టెంట్ సెక్రటరీ పాషా, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి. మధుకర్ రెడ్డి, సీఎంఓఏఐ అధ్యక్షుడు నజీర్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



# తాగునీరు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

*** రామప్ప, గణపురం చెరువులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం, (ప్రజాస్ఫూర్తి): గణపురం మండలంలోని చారిత్రక గణపురం చెరువు, రామప్ప చెరువులను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించి నీటిమట్టాన్ని పరిశీలించారు. అనంతరం రామప్ప నుంచి గణపురం చెరువుకు నిర్మిస్తున్న గ్రావిటీ కాలువ, రామప్ప-పాకాల పంప్‌హౌస్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి గణపురం చెరువు నిండుగా ఉంటే గణపురం మండలంతో పాటు భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల ప్రాంతాల్లోని మోరంచ వాగు పరిధి రైతులకు రెండు పంటలు పండించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం చెరువులో సుమారు 15 అడుగుల మేర మాత్రమే నీరు ఉండడం, వర్షాభావ పరిస్థితులు కొనసాగడం ఆందోళన కలిగిస్తోందన్నారు.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాదుల పథకం ద్వారా రామప్ప నుంచి గణపురం చెరువుకు గ్రావిటీ కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వ మార్పు తర్వాత పనులు నిలిచిపోయాయని విమర్శించారు.గణపురం చెరువుపైనే గణపురం, భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, రేగొండ, గోరికొత్తపల్లి మండలాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం నీటిమట్టం తగ్గిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దేవాదుల నుంచి రామప్పకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో రామప్పలో పూర్తి నీటిమట్టాన్ని కొనసాగిస్తూ, అక్కడి నుంచి గ్రావిటీ కాలువ ద్వారా గణపురం చెరువుకు నీటిని తరలించాలని కోరారు. చెరువును పూర్తి స్థాయిలో నింపి తాగునీరు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, సాగునీటి శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సర్ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి

*** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని తన నివాసం చుంచుపల్లి మండలం విద్యానగర్లో గురువారం ఆయన తన ఎన్యుమరేషన్ పత్రాన్ని స్వయంగా నింపి బిఎల్ఓ నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి ఎన్నికల అధికారులకు, బిఎల్ఏలకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని కోరారు. అలాగే రాజకీయ పక్షాలు, ఆయా పార్టీల తరపున నియమితులైన బిఎల్ఏలు కూడా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొని సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి పౌరునికి ఓటు హక్కు అనేది అత్యంత విలువైన ఆయుధమని, దేశ భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత ఓటుపైనే ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు .. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జనార్దన్, స్థానిక వార్డ్ మెంబర్ మాలోత్ శంకర్ ,ఆర్ఐ నరసింహారావు, జిపిఓ బాలాజీ, బిఎల్ వోలు బోస్ , నాగరాణి , పంచాయతీ గుమస్తా బండా రామకృష్ణ పాల్గొన్నారు.

# హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై వరుస విషాదాలు..

*** రెండు చోట్ల ఘోర ప్రమాదాలు, నలుగురు మృతి, ఒక్కరికి తీవ్ర గాయాలు.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై గురువారం రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు విషాదాన్ని నింపాయి. స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్లు సమీపంలో ఇసుక లారీని కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. అదే రోజు జనగామ జిల్లా కేంద్రంలోని బైపాస్ వద్ద బైక్‌ను కారు ఢీకొనడంతో మరో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లింగాల ఘణపురం మండలం, మాణిక్యపురం గ్రామానికి చెందిన మరికుక్కల రాములు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి అయిన జాటోతు కిషన్ కు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. రెండు ప్రమాదాల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదాలకు గల కారణాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ నిర్ణీత ధరలకు డిఏపి విక్రయించాలి

* వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడిన వంగ రాజేశ్వర్ రెడ్డి



సిద్దిపేట, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో కొందరు వ్యాపారులు కోరమాండల్ డీఏపీ ఎరువుల బస్తాలపై ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వంగ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తెలపడంతో వెంటనే స్పందించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయన నేరుగా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోరమాండల్ డీఏపీ బస్తాను రూ.1350 లకే ఎటువంటి అదనపు లింకు లేదా 'అటాచ్మెంట్' వస్తువులు లేకుండా విక్రయించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

**ప్రైస్ డిస్ప్లే బోర్డులు తప్పనిసరి**

రైతులకు స్పష్టత , పారదర్శకత చేకూరేలా ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్మితే ఊరుకునేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గ రైతాంగానికి పెద్ద ఎత్తున ఊరట లభించనుంది.రైతు సంక్షేమమే ధ్యేయంగా తక్షణమే స్పందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి చొరవ పట్ల నియోజకవర్గ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

* స్వాములవారి లింగోటం గ్రామ పంచాయతీని సందర్శన
* ఎంపీడీఓ శ్రీలత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చౌటుప్పల్ ఎంపీడీవో శ్రీలత అన్నారు. చౌటుప్పల్ మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీఓ శ్రీమతి శ్రీలత, ఏపీఓ ఈశ్వరయ్యతో కలిసి ఎస్. లింగోటం గ్రామ పంచాయతీని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ, ఉపసర్పంచ్ బాతరాజు ధనుంజయ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఎంపీడీఓ శ్రీలత ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని సందర్శించారు. అక్కడ పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో నర్సరీల పాత్ర ఎంతో కీలకమన్నారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కావ్యరెడ్డి, వార్డు సభ్యులు పిట్టల శోభా సధానందం, పల్సం శంకరయ్య, ఉప్పు వీరేశం, బాతరాజు లింగస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత అందరి బాధ్యత : కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజాస్ఫూర్తి : రహదారి నియమాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలను సమర్ధవంతంగా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో పోలీసు, రవాణా, ఆర్అండ్బీ, మున్సిపల్, పంచాయతీరాజ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల అమలు, అధిక వేగ నియంత్రణ, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం ప్రమాదాల నివారణకు కీలకమని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, యువత రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాద బాధితులను గంటలోపు ఆసుపత్రికి తరలించిన వారికి "రహవీర్ అవార్డు"తో పాటు రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపారు. పీఎం రాహత్ పథకం ద్వారా ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదురహిత వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్అండ్బీ ఎస్ఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, ఈడీఏఆర్ మేనేజర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలి

* అడిషనల్ పీడీ శిరీష

కూసుమంచి,ప్రజాస్ఫూర్తి: ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భజలాలు పెరుగుతాయని, ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని అడిషనల్ పీడీ శిరీష సూచించారు. గురువారం కూసుమంచి మండలకేంద్రంలోని నివాసాలలో ఏర్పాటు చేసుకున్న ఇంకుడుగుంతలను సర్పంచ్ కిష్టవేణి, ఏపీవో, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ తారాచంద్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను గమనంలో ఉంచుకుని ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని కోరారు. ఉపాధి సిబ్బంది గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలలో, చేతిపంపుల వద్ద కూడా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా పనిచేస్తుంది

* ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళ సంఘాల సభ్యులకు మహిళా శక్తి చీరల ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యంగా మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత, వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు,వ్యాపారాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తూ మహిళలను స్వావలంబన దిశగా తీసుకెళ్తోందన్నారు. అలాగే ఇందిరా మహిళా శక్తి, మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి ప్రజాపాలన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో కలిసి అర్హులైన మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఈ సందర్భంగా కోరారుఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేఖాబాబురావు భువనగిరి సింగిల్ విండో చైర్మన్ కొండల్ రెడ్డి మున్సిపల్,కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

# నిరంతరాయంగా కొనసాగుతున్నాయి

* ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని మరోసారి స్పష్టమైంది. గురువారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ పాలనకు నిదర్శనంగా నిలిచారు. ముందుగా మెదక్ పట్టణంలోని 12వ వార్డులో ఉన్న టీజీటిడబ్ల్యూయూఆర్జేసీ (బాలికల) కళాశాలలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. విద్యార్థినుల సౌకర్యార్థం నిర్మించనున్న హాస్టల్ భవనం, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, సీసీ రోడ్లు, యార్డ్ లైటింగ్ వంటి మౌలిక వసతుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేయడానికి సీఎం నాయకత్వంలోని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. బాలికలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తామన్నారు. మెదక్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికే వినియోగిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాపన్నపేట మండలం పోడుచంపల్లి గ్రామంలో మత్స్యకార సంఘ సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. అదే విధంగా పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్పర్సన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు అనీస్ ఫాతిమా, హరిత, గంట సంపత్, రామకృష్ణ, గౌస్, నర్సింలు, కోఆప్షన్ సభ్యుడు తాహెర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, నాయకులు రాగి అశోక్, భూపతి రాజు,బుద్ద రాజు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిల్లల హక్కులపై

# అవగాహన కార్యక్రమాలను జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలి

* జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, ప్రజాస్ఫూర్తి : పిల్లల హక్కులపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్అన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొని సమావేశంలో మహిళా,శిశు సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్ అధికారి,పోలీస్ శాఖ,విద్యాశాఖ,వైద్య ఆరోగ్య శాఖ,పంచాయతీరాజ్ శాఖ, లేబర్ డిపార్ట్మెంటు, జిల్లా బాలల సంరక్షణ యూనిట్, బాలల సంక్షేమ కమిటీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, పాఠశాల విడిచిన పిల్లల గుర్తింపు, అనాథ, అర్ధానాథ పిల్లలకు ప్రభుత్వ పథకాల అమలు, స్పాన్సర్షిప్, ఫోస్టర్ కేర్ సేవల పురోగతి, ఫోక్స కేసుల సమీక్ష,అలాగే విద్యాశాఖ ప్రతి నెల డ్రాప్ అవుట్ విద్యార్థుల జాబితాను సమర్పించాలని, ఆరోగ్యశాఖ ఇంటర్మీడియట్, పాఠశాల విడిచిన పిల్లలకు కౌన్సెలింగ్ సేవలు అందించేందుకు సైకియాట్రిస్ట్/ సైకాలజిస్ట్ సేవలను అందుబాటులో ఉంచాలన్నారు.పోలీస్ శాఖ బాల్య వివాహాల హాట్స్పాట్ గ్రామాలను గుర్తించి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డి ఆర్ డి ఎ పంచాయతీరాజ్ శాఖలు గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను మండల బాలల పరిరక్షణ కమిటీలను లను బలోపేతం చేసి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించాలన్నారు. అక్రమ దత్తతలు హాస్పిటల్స్ నందు జరగకుండా చూడాలని చెప్పడం జరిగింది. జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ లోని పిల్లలందరికీ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలపడం జరిగింది. మండల కేంద్రాల్లో అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, శాఖల అధికారులు పాల్గొనే ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అనాథ, అర్ధానాథ, ప్రత్యేక అవసరాల పిల్లలకు అర్హత కార్డులు, ఇతర ప్రభుత్వ పథకాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాలకు సహకరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లాలో పిల్లల పరిరక్షణకు సంబంధించి అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి తదుపరి సమావేశానికి చర్యల నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి రాజు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, ఆరోగ్యాధికారి జ్ఞానేశ్వర్, జిల్లా ఇంటర్ అధికారి మాధవి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీఎస్పీ ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందన్పల్లి అటవీ పరిధిలో

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత




ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం డివిజన్ ఇందన్పల్లి రేంజ్,ఇందన్పల్లి సెక్షన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, అటవీ శాఖ సిబ్బంది గురువారం రోజున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం అటవీ శాఖ ఆధీనంలో ఉంచి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులలో అక్రమ ఇసుక తవ్వకం మరియు రవాణాపై అటవీ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా గ్రామాల్లోని అభివృద్ధి పనులకు అనుమతి ఉన్న ఇసుక రిచ్ ల నుండి ఇసుక తీసుకుని రావాలని,దీనికి ప్రభుత్వం డబ్బులు ఇస్తుంది అని ఐన కూడా కొంతమంది డబ్బులు మిగిలించుకోవడానికి తమ స్వార్థం కోసం అటవీ నుండి లేదా ఈకో సెన్సిటివ్ జోన్ నుండి ఇసుకను దొంగిలించి అక్రమంగా రవాణా చేస్తూ ప్రజల కు అటవీశాఖ పైన చేడు అభిప్రాయం వచ్చేలాగా,అటవీశాఖ ను శత్రువు లాగా చూపుతున్నారు అని తెలిపారు ఇసుక భూగర్భ జలాల పరిరక్షణ లో ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలు ఇట్టి విషయాన్ని అర్థం చేసుకొని అటవీశాఖ కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు శేషారాం, హనుమంతరావు, ఎఫ్ బి ఓ లు శ్రీనివాస్, తన్వీర్ లు, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు మంజూరి ప్రక్రియలో భాగంగా గుడిసెలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మోత్కూర్ మండలం అనాజిపురం గ్రామంలోని జంగాల కాలనీలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గుడిసెలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాలనీలో మొత్తం ఎన్ని గుడిసెలు ఉన్నాయో, వాటిలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ఎన్ని గుడిసెలు ఉన్నాయో అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుడిసెలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి అర్హులైన లబ్ధిదారులందరికి ఇవ్వడం జరిగిందన్నారు.అనంతరం మొదటి విడతలో మంజూరై ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి ఎన్ని రోజులు అవుతుందో అని అడిగి తెలుసుకొని, పనులు ఏ దశలో ఉన్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తయినంత వరకు బిల్లులు వచ్చాయా ,లేదా అని ఆరా తీశారు. ఇంటి నిర్మాణాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసుకోవాలని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. నాణ్యతతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో రోడ్డు పనులు నత్తనడకన నడుస్తుండడంతో చౌటుప్పల్ వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల పార్టీ కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులు జాప్యం కావడం వల్ల ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని వ్యాపారస్తులు ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్డు వెంట ఉండే చిరు వ్యాపారస్తుల వ్యాపారం నడవక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, పిల్లి శంకర్, ఉడత రామలింగం, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్ కాలనీలో సర్ హెల్ప్ డెస్క్ కు విశేష స్పందన



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీలో పాలకమండలి సహకారంతో గ్రామ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్ హెల్ప్ డెస్క్ కు విశేష స్పందన లభిస్తుంది . ముందుగా గ్రామ వార్డు మెంబర్స్ వారి వార్డ్ ఓటర్లను బి ఎల్ ఓల సహకారంతో సర్ ఫారములను అందజేస్తూ ఓటర్లను అప్రమత్తం చేస్తూ వారికి ఇన్ఫర్మేషన్ పాస్ చేయటంతో పాటు వాటిని దగ్గరుండి పూర్తి చేయించి బిఎల్ఓ లకు అందిస్తూ ఆన్లైన్ చేపిస్తున్నారు . ఈ సందర్భంగా సర్పంచ్ , ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు సర్ అప్లికేషన్ ఫామ్స్ ను పూర్తి చేయటం కొరకు పాలకమండలి ప్రత్యేకంగా వాలంటీర్స్ ను ఏర్పాటు చేసామని , ఓటర్లకు కావలసిన సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నామని వారన్నారు. ఫామ్స్ తీసుకున్న ఓటర్లు సకాలంలో బిఎల్వోలుకు అందజేయాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో సీనియర్ వార్డ్ మెంబర్ వాడపల్లి జకరయ్య ,గజ్జీ కృష్ణమూర్తి , బి ఎల్ వోలు , పాల్గొన్నారు .

## నిరుద్యోగుల మహాధర్నాకు సీపీఎం నాయకుల తరలింపు



జనగామ,ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలో ఖాళీ గా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంట నే భర్తీ చేయాలని, నిరుద్యోగుల సమ స్యలను పరిష్కరించాలని డిమాండ్ చే స్తూ హైదరాబాద్ లో నిర్వహించిన ని రుద్యోగుల మహా ధర్నాకు జిల్లా సీపీ ఎం నాయకులు, కార్యకర్తలు తరలి వె ళ్లారు. జిల్లా కర్యదర్శి మోకు కనక రెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించా రు. ఈ సందర్భంగా అయన మాట్లాడు తూ ప్రభుత్వం పై విమర్శలు చేశారు.ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని,నిరుద్యోగ యువతకు ఇచ్చి న హామీలను అమలు చేయాలని డి మాండ్ చేశారు. మహాధర్నా విజయ వంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

## జాతీయ సాంఘిక సేవా పురస్కారం




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: 2026 సేవా ఐక్యత శ్రేష్ఠత నేషనల్ సోషల్ సర్వీస్ వారు సగర్వంగా మహంకాళి ప్రణీత్ సామాజిక కార్యకర్త సూర్యాపేట పట్టణం లో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సూర్యాపేట జిల్లా తెలంగాణ రాష్ట్రం వారికి ఈ సంవత్సరపు ఉత్తమ సామాజిక సేవా కార్యకర్తగా అవార్డు ప్రకటించారు. దివ్యాంగుల మరియు సమాజ సంక్షేమం కోసం మహంకాళి ప్రణీత్ చూపిన అసాధారణమైన అంకితభావం, నిస్వార్థ సేవ మరియు అవిశ్రాంత కృషికి గుర్తింపుగా ఈ ప్రశంసా పత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నామని తెలిపారు. ఆయన నాయకత్వం, కరుణ, నిబద్ధత ఎన్నో జీవితాలకు స్ఫూర్తినిస్తూ, మరింత సమ్మిళిత, సాధికార సమాజాన్ని నిర్మిస్తూ, అర్థవంతమైన మరియు శాశ్వతమైన ప్రభావాన్ని సృష్టించాయని తెలిపారు. మానవాళికి అందిస్తున్న అసాధారణ సేవకు ధన్యవాదాలు తెలుపుతూ ఈమెయిల్ ద్వారా ఈ సర్టిఫికెట్ ను అందించడం జరిగిందని ఒక ప్రకటనలో మహంకాళి ప్రణీత్ తెలిపారు. ఈ అవార్డు నా యొక్క బాధ్యతను మరింత పెంచింది అని అన్నారు.

## మా రక్తం ఇస్తాం.! మా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయి

* **సావుల ఆదిత్య, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయాలనే స్కాంగ్రెస్ కుట్రకు నిరసనగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి చిత్రపటానికి రక్తంతో అభిషేకం చేస్తూ మా రక్తం కూడా ఇస్తున్నాం, మా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయండి అని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెయిల్ అడుగుతున్న రైతులను రక్తం చల్లుకుని పంటలు పండించండి అన్నారు కదా మేము కూడా రక్తం పిచ్చి మీ రక్త దాహాన్ని తీర్చుతాం పెండింగ్లో ఉన్న 12,000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు, తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ ఈ బీసీ విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించాలని, తద్వారా వారి కుటుంబాలను ఆర్థికంగా, సామాజిక ఉన్నతంగా నిలబెట్టాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని, ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సీఎం చిత్రపటానికి రక్తాభిషేకం చేసే నిరసన తెలియజేయడం జరిగింది. గతంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తుంగలో తొక్కుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని, మా ప్రభుత్వంలో బకాయిలు చెల్లించడంతో పాటుగా,గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన నేటి ముఖ్యమంత్రి తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ అన్నారు.ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని, బడ్జెట్ కాలేజిలు సైతం మూతపడుతున్నాయని, పొట్టకూటి కోసం లెక్చరర్ గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు.రీయింబర్స్ మెంట్ స్కాలర్షిప్స్ అనేవి విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం వేసే బిక్ష కాదన్నారు.రీయింబర్స్ మెంట్ కోసం అడిగితే విద్యార్థులపై ఉక్కుపాదం మోపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ రాజేష్ ,నగర ఉపాధ్యక్షుడు సంతోష్, అంజి, నగర సంయుక్త కార్యదర్శి రంజిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్యానికి గురైన మాజీ డీసీసీ అధ్యక్షులు, కేఎం, ప్రతాప్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ డీసీసీ అధ్యక్షులు, కే ఎం, ప్రతాప్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఉన్నట్టు ఉండి అనారోగ్యానికి గురయిన ప్రతాప్ ఊపిరి అడక ఇబ్బంది పడుతుండగా, స్ట్రోక్ రావటం తో పరిస్థితి విషమించినట్లు సమాచారం.ప్రస్తుతం చింతల్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో వెంటిలేటర్ పై చికిత్స పొందుతునట్లు సమాచారం.విషయం తెలుసుకున్న ఆయన కుమారుడు వెంటనే దుబాయ్ నుండి నగరానికి చేరుకొని ఆయన ఆరోగ్య పరిస్థితి పై వైద్యుల తో మాట్లాడారు.మేరుగయిన వైద్యం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

* **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ.1,500కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు.సీతారామ ప్రాజెక్టులో గతంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ ప్రస్తుతం రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ పనులను కూడా చేపట్టామని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు.సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి సాయిబాబా పై అసత్యపు ప్రచారాలు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు

* **ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శివశక్తి శిరిడి సాయి అనుగ్రహ మహాపీఠం సిద్ధగురు రమణానంద మహర్షి ఆశ్రమంలో గురువారం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు మాట్లాడుతూ శ్రీ షిరిడి సాయిబాబా పై 8మంది సాయి వ్యతిరేకులు చేసిన విమర్శలను విని మేము చాలా బాధపడ్డాం ఎంతోమంది సాయి భక్తులు సాయి దేవాలయాల నిర్వాహకులు సమర్థవంతంగా సాయి వ్యతిరేకులకు బుద్ధి చెప్పలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారు సాయి ప్రజ్ఞాన నిలబడి దీటుగా శత ప్రశ్న శర సంధానం గ్రంథం రాసి స్థాయి వ్యతిరేకుల నోరు మూయించారు సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారు ఒక్కరే ధైర్యంగా నిలబడి సాయి వ్యతిరేకుల పైపోరాటం చేయడం మాకు చాలా సంతోషం అనిపించింది అని తెలిపారు అందుకే సాయి భక్తులమైన మేము కూడా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారికి తోడుగా రక్షణగా నిలబడి సాయి వ్యతిరేకులపై పోరాడుతామని కొంతమంది ఓయూ కాలేజీ విద్యార్థులు తెలిపారు ఈ సందర్భంగా మేము సామూహికంగా మహాపీఠానికి వచ్చి శ్రీ రమణానంద మహర్షి వారికి మా మద్దతు ప్రకటిస్తామని తెలిపాం సిద్ధ గురువు రమణానంద మహర్షి వారు మా మద్దతును ఆమోదించాలని సభా పూర్వకంగా కోరుతున్నాము అంతేకాకుండా ఎవరి ప్రభావానికి ఒత్తిడిలకు లోను కాకుండా మాకై మేము స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించాలని నిర్ణయించుకున్నామని తెలిపారు ఇకనైనా సాయి వ్యతిరేకులారా వెంటనే శిరిడి సాయిబాబా పై చేసిన విమర్శలను అసత్యపు ప్రచారాలను మానుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున రాష్ట్రంలో భారత దేశంలో సాయి భక్తులతో ధర్నాలు రాస్తారోకులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా సాయి వ్యతిరేకులను హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఓయూ కాలేజ్ నాయకులు ఆవుల మల్లేశం, వేముల కొండల గౌడ్, మామిడాల రవికుమార్, వెంకటేష్ గౌడ్, నరిమెట్ల గురు, పాలకుర్ల జానయ్య గౌడ్, ధీరజ్, శంకర్, ఎస్ నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పేదింటి తల్లి..

* **దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ఓ పేదింటి తల్లికి ఆపద వచ్చింది కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది మెరుగైన వైద్యం అందించేందుకు చిల్లిగవ్వలేదు మనసున్న మహారాజులు తమకు తోసినంతలో సహాయం చేసి నిండు ప్రాణాన్ని కాపాడాలని కుటుంబ సభ్యులు దాతలను కోరుతున్నారు. మాడుగులపల్లి మండలం, తోపుచర్ల గ్రామానికి చెందిన ఓ పేద కుటుంబం ఆర్థిక కష్టాలతో కన్నీటి పర్యంతమవుతోంది. ఆ ఇంటి ఇల్లాలు, ఇద్దరు చిన్నారులకు తల్లి అయిన 35 ఏళ్ల పాల్వాయి సైదమ్మ తీవ్ర కిడ్నీ వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సైదమ్మకు మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యులు తమ వద్ద ఉన్న ఆస్తిపాస్తులను అమ్ముకుని, అప్పులు చేసి చికిత్స కొనసాగించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు తక్షణమే కిడ్నీ మార్పిడి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని వైద్యులు సూచించారు.రోజు వారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న భర్త పాల్వాయి వెంకన్న, చాలీచాలని ఆదాయంతో ఇద్దరు కుమారులను చూసుకుంటూనే భార్య వైద్య ఖర్చులను భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భార్య ప్రాణాలను కాపాడేందుకు చేతిలో ఉన్నదంతా ఖర్చు చేసిన ఆయన ఇప్పుడు దాతల సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.వైద్యుల అంచనా ప్రకారం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతటి భారాన్ని భరించే స్థోమత లేకపోవడంతో, మనసున్న దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి సైదమ్మకు పునర్జన్మ ప్రసాదించాలని వారు కన్నీటి వేడుకతో కోరుతున్నారు.మీరు చేసే చిన్న సహాయం మా కుటుంబానికి పెద్ద అండగా నిలుస్తుంది. ఇద్దరు చిన్నారుల తల్లిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.సహాయం చేయదలిచిన దాతలు గూగుల్ పే / ఫోన్‌పే: 99495 25672 కి పంపించగలరని కోరుతున్నారు.

## జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం

* **ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా: రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ" ని అందజేసింది.ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ షాక్‌తో గేదెలు మృతి

* **ఇద్దరు రైతులకు సీఎం సహాయ నిధి నుంచి ఎక్స్‌గ్రేషియా**



జనగామ,ప్రజాస్ఫూర్తి : ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి గేదెలు మృతి చెందిన దేవరుప్పుల మండలాని కి చెందిన ఇద్దరు పశుపోషక రైతులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్) నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝా గురువారం అందజేశారు.దేవరుప్పుల గ్రామానికి చెందిన ఉప్పల అంజ య్యకు రూ.1 లక్ష,చిన్నమడ్డూర్ గ్రామా నికి చెందిన అనగాని రాజుకురూ. 1.2 0లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందించారు. ప్రజావాణిలో వచ్చిన విన తుల ఆధారంగా బాధితుల పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేయగా ఆర్థిక సాయం మంజూరైనట్లు క లెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సానుభూతితో పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# సూర్యాపేట ఆర్యవైశ్య సంఘం పరువును దిగజార్చవద్దు

* **ఆర్యవైశ్య పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పదవుల విషయంలో ఒకరిపై ఒకరు సమస్యలు చేసుకుంటూ ఆర్యవైశ్య సంఘం పరువును దిగజార్చ వద్దని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు కలకోట లక్ష్మయ్య, కుక్కడపు శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య కౌన్సిల్ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి పోటీ ఉందని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి నేడు రాచర్ల కమలాకర్ కు పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా ఆర్యవైశ్య సంఘం క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్ష పదవికి పోటి వున్నప్పటికి ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని అన్నారు.ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్ గా రాచర్ల కమలాకర్ ఫ్లెక్సీలలో వేయించుకున్నాడని దీనిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రమాణ స్వీకారానికి ఇంకా మూడు రోజుల సమయం ఉన్నందున ఆర్యవైశ్య పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడు బేలిదే శ్రీనివాస్ బేషజాలకు పోకుండా అందరిని సమాన దృష్టితో చూడాలని, ఎన్నికల్లో తనకు ఓటు వేయని వారిని ప్రశ్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇప్పటికైనా అలాంటి విధానాలు మార్చుకోవాలన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మీలా వంశీ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గత 11 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా ఉండి సూర్యాపేట పట్టణ సంఘానికి చేసింది ఏమి లేదన్నారు. ఏదైనా కార్యక్రమం ఉందంటే అధ్యక్ష హోదాలో రావడమే తప్ప పట్టణ ఆర్యవైశ్య పేదలకు బీద విద్యార్థులకు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వంగవీటి రమేష్, వుప్పలంచు కృష్ణ, గుండా కరుణాకర్, మంచాల శ్రీనివాస్ గుప్త,పల్లెర్ల ప్రసాద్, తవిడిశెట్టి కృష్ణకుమార్, పసుమర్తి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# బచ్చన్నపేట భారీ చోరీ కేసు ను ఛేదించిన పోలీసులు

* **ముగ్గురు నిందితుల అరెస్ట్, రూ. 15. 50 లక్షల సొత్తు స్వాధీనం.**

బచ్చన్నపేట/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని బచ్చన్నపేట లో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు వే గంగా ఛేదించారు.ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రూ.15.50 లక్షలకు పైగా విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. 8వ తేదిన దొంతుల సోమలింగం కుటుంబం చికిత్స కోసం హైదరాబాద్ కు వెళ్లగా, 10 వ తేదీన తిరిగి వచ్చి చూడగా ఇం టి తాళాలు పగులగొట్టి బీరువా లోని బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గు రైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం జనగామ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన పత్రిక సమావే శం లో ఏసీపీ భీమ్ శర్మ కేసు




వివరాల ను వెల్లడించారు. వెస్ట్ జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మార్గదర్శకత్వంలో, జనగామ ఇన్‌చార్జ్ ఏసీపీ భీమ శర్మ ప ర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయ ణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, సాంకేతిక ఆధారాల స హాయంతో దర్యాప్తు చేప ట్టి నిందితులను మండలం కొన్నె క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి సుమారు 8 తు లాల బంగా రు ఆభరణాలు (రూ.12 ల క్షలు), 1.475 గ్రాముల వెండి వస్తువు లు (రూ.3.50 లక్షలు), రూ.15 వేల న గదు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీ నం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు కంప విజ య్ అలియాస్ "మొండి" పై ఇప్పటికే 36 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని తోపాటు ఇద్దరు జువెనైల్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. బచ్చన్నపే ట, లింగాల ఘణపురం, జనగామ, మ హబూబాబాద్ లో జరిగిన పలు చోరీ లు కూడా వీరే చేసినట్లు విచారణ లో వెల్లడైంది. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని డీసీపీ రాజమహేం ద్ర నాయక్ అభినందించారు. ప్రజలు ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకో వాలని,ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయం లో స్థానిక పోలీసులకు సమాచారంఇవ్వాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు.

## అక్కన్నపేట మండలంలో 90 శాతానికి పైగా ఓటరు నమోదు

* **హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ చైర్మన్ జంగంపల్లి ఐలయ్య**



అక్కన్నపేట, ప్రజాస్ఫూర్తి: అక్కన్నపేట మండలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన (సర్) ఓటరు నమోదు కార్యక్రమం 90 శాతానికి పైగా విజయవంతంగా పూర్తి కావడం పట్ల హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ చైర్మన్ జంగంపల్లి ఐలయ్య హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితాలిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అంకితభావంతో పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ ఏజెంట్లు, బి ఎల్ ఏలు, బి ఎల్ ఓలు, ఎన్నికల సిబ్బంది మరియు సహకరించిన ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామ గ్రామాన తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలు అభినందనీయమని అన్నారు.రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని జంగంపల్లి ఐలయ్య పేర్కొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేసిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండలం విద్యానగర్లో గురువారం ఆయన తన ఎన్యుమరేషన్ పత్రాన్ని స్వయంగా నింపి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి ఎన్నికల అధికారులకు, బిఎల్ఏలకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు జాబితాలో తప్పులుంటే సవరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జనార్దన్, ఆర్ఐ జి నరసింహారావు, విఆర్వోలు బాలాజీ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## 11వ వార్డులో ఉచిత కంటి పరీక్షల శిబిరం

* **వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : కంటి సమస్యల పరిష్కారం కోసమే శరత్ మాక్స్ విజన్ సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించినట్లు 11 వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ ఆధ్వర్యంలో శరత్ మ్యాక్స్ విజన్ సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోరే సందీప్ కుమార్, ఆప్తమాలజిస్ట్ అనూష సీహెచ్‌డబ్ల్యూ సదానందం ఆధ్వర్యంలో 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఆపరేషన్ అవసరమైన ఏడుగురి కి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని తెలిపారు. కంటి సమస్యలపై అశ్రద్ధ చేయరాదని, ఉచిత కంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ వర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష సాగర్ బూరుగు లత కృష్ణస్వామి, కొండ రజిత సతీష్, పిల్లి తిరుపతి బొలిశెట్టి రాజు, కేశవేణి రమేష్ బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ గాదపాక రవీందర్, శరత్ మ్యాక్స్ విజన్ అసిస్టెంట్ మేనేజర్ ముసిపట్ల సాగర్, బత్తుల సరూప రవీందర్, గోపగోని శోభన్, కోఆప్షన్ సభ్యుడు హసన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి: ఏఐవైఎఫ్



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు అనేక హామీలకు ఇచ్చినప్పటికీ, ఆచరణలో విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఏఐవైఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల మహాసభను కూసుమంచి మండల పరిధిలోని లాల్ సింగ్ తాండా లో మాజీ యువజన నాయకులు భూక్యా నరసింహ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మహాసభల ప్రతీకగా ఏఐవైఎఫ్ యువజన సంఘ జెండాను మాజీ యువజన నాయకులు సంగబత్తుల ఉపేందర్ రెడ్డి ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ యువజన సమస్య పరిష్కారానికి, విద్య, ఉపాధి హక్కుల సాధనకు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు, ప్రజాస్వామ్య, లౌకిక భారత నిర్మాణానికి కొత్త కార్యచరణ అఖిల భారత యువజన సమాఖ్య అనునిత్యం పోరాడుతుందన్నారు. రానున్న రోజుల్లో మరింత యువజన సమస్యల పరిష్కారానికి పోరాటానికి సన్నద్ధమవ్వాలని కోరారు. ఆగష్టు మొదటి వారంలో ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు జరగున్నాయని అన్నారు. ఈ మహాసభలకు యువజన నాయకులు, బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండెపంగు మల్లేష్, మండల సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్ రెడ్డి, కిరణ్ శివ, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు భూక్య శ్రీకాంత్, ప్రసాద్, మల్సూర్, భూక్యా వీరన్న నాయకులు జిల్లా నాగయ్యా, తెలు పిచ్చయ్య, బెల్లి హుస్సేన్, వీరబాబు, జిల్లా వీరబాబు, మోహన్, మహేష్, చంటి, నాగరాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వీరబాబు, నరసింహ ఏకగ్రీవ ఎన్నిక




కూసుమంచి ప్రజా స్ఫూర్తి: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉడతలగూడెం గ్రామానికి చెందిన ఉడత వీరబాబు, లాల్ సింగ్ తండా గ్రామానికి చెందిన భూక్యా నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.లాల్ సింగ్ తండా లో బుధవారం ఏఐవైఎఫ్ మండల మహాసభను విజయవంతంగా నిర్వహించారు. ఈ మహాసభలో వీరితో పాటు ఉపాధ్యక్షులుగా జిల్లా నాగరాజు, భూక్యా మోహన్ సహాయ కార్యదర్శులుగా గుండెపంగు మధు, బెల్లి హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా జిల్లా లింగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అల్లి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 18 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఉడత వీరబాబు, భూక్యా నరసింహ మాట్లాడుతూ.. యువత సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో, నిరంతరం పోరాడుతామని తెలిపారు. నిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై యువతను చైతన్యపరిచి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని అన్నారు. మండలంలో ఏఐవైఎఫ్ ను గ్రామస్థాయిలో విస్తరించి, యువతను సంఘటితం చేస్తామని స్పష్టం చేశారు. నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేసి, వారి నాయకత్వంలో ఏఐవైఎఫ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గించాలి

* **వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి**



పాలేరు, ప్రజా స్ఫూర్తి:కూసుమంచి మండలం పాలేరు క్లస్టర్ పరిధిలోని పాలేరు గ్రామంలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (యన్ ఎం యన్ ఎఫ్) కార్యక్రమంపై రైతులకు విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి ఆధ్వర్యంలో రైతులకు సహజ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాలు మరియు అమలు విధానాలపై సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, రసాయన ఎరువులు మరియు పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి, స్థానికంగా లభించే సహజ వనరులతో వ్యవసాయం చేయడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు పంట ఉత్పత్తుల నాణ్యతను పెంచుకోవచ్చని తెలిపారు. సహజ వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు.అదేవిధంగా, జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం, ఆవు ఆధారిత సహజ ద్రావణాల తయారీ, వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, సేంద్రియ కార్బన్ పెంపు, సూక్ష్మజీవుల అభివృద్ధి, సమీకృత పోషక మరియు చీడపీడల యాజమాన్యంపై రైతులకు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాలేరు వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక, నేచురల్ ఫార్మింగ్ వాలంటీర్ జశ్వంత్ మరియు రైతులు పాల్గొన్నారు.అనంతరం వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు మరియు వ్యవసాయ భూమిలో 100% రాయితీతో నీటి కుంటల ఏర్పాటు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జనగామ రైతులకు ఉద్యానవన శాఖ సబ్సిడీలు



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లో ఉద్యా న పంటల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వ పథకాల కింద రైతులకు వివిధ రకా ల సబ్సిడీలు అందిస్తున్నట్లు జిల్లా ఉ ద్యానవన మరియు పట్టుపరిశ్రమ శాఖ వెల్లడించింది. డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ పామ్, పండ్ల తోటలు,శాశ్వత పందిళ్లు, మల్బరీ సాగు, పూలు, కూరగాయల సాగుకు 2026 27 ఆర్థిక సంవత్సరం లో భారీగా రాయితీలు అమలు చేస్తు న్నట్లు తెలిపింది. అర్హులైన రైతులు మీ సేవా కేంద్రం లేదా సంబంధిత ఉద్యాన వన అధికారుల ద్వారా దరఖాస్తు చేసు కుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చే సుకోవాలని సూచించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్సిడీల ఎంపిక ప్రక్రి యను పూర్తిస్థాయి పారదర్శకతతో చే పడుతున్నట్లు అధికారులు తెలిపారు.

## రైతులకు యూరియా, విత్తనాల కొరత ఉండొద్దు

**: జిల్లా కలెక్టర్సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో రైతు లకు నాణ్యమైన యూరియా, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబా టు లో ఉంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించా రు. గురువారం కలెక్టరేట్ లో నిర్వహించి న ఎస్.హెచ్.జి మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 62 రైతు సేవా కేంద్రాల్లో ప్రస్తుతం 44 కేంద్రాలు పనిచే స్తుండగా, మరో 15 ఈ పోస్ యంత్రా ల పంపిణీతో మొత్తం 59 కేంద్రాలు రై తులకు సేవలు అందించనున్నట్లు తెలి పారు. ప్రతి కేంద్రంలో స్టాక్, ఇండెంట్, లైసెన్సులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వ హించాలని, అధికారులు నిరంతరం ప ర్యవేక్షించాలని సూచించారు. అనంత రం మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలకు 15 ఈ పోస్ యంత్రాలను కలెక్టర్ పం పిణీ చేశారు. సమావేశంలో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు,స్త్రీ నిధి బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ జగన్నాథ స్వామి వారి రథయాత్ర మహోత్సవం



జీడిమెట్ల,ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్(పద్మా నగర్ డివిజన్)పరిధిలోని పలు ప్రాంతాల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్, సాయి నగర్, ప్రసూన నగర్, మాణిక్య నగర్, సుదర్శన్ రెడ్డి నగర్, కాకతీయ నగర్ లలో నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర లలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి, సమానత్వానికి ప్రతీకగా భావించే ఈ పవిత్ర రథయాత్రలో భక్తులతో కలిసి స్వామివారి రథాన్ని లాగి, అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి కుటుంబంపై శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య అనుగ్రహం ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే నియోజకవర్గంలో తిరగనివ్వరు

**: చింతల సాయిలు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిజం ఏమిటో తెలుసుకొని మాట్లాడండి మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే మీపై మళ్లీ తిరగబడతారని జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీ చింతల సాయిలు అన్నారు. రాజ్ గోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసం పాకులాడటం కాదు పార్టీ అధిష్టానం ఇచ్చిన హామీ మేరకే మంత్రి ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తప్ప మంత్రి పదవి పై వ్యామోహం కాదు మంత్రి అయితే మునుగోడు నియోజకవర్గన్ని భవిష్యత్తులో 50ఏళ్లకు సరిపోయే నిధులు తెచ్చి ఈ నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో ఉన్న వ్యక్తి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చిల్లర కమిషన్లు వసూలు చేసే మనస్తత్వం కాదని, తన జీవితంలో ఎక్కడా కూడా తన చెయ్యి పైననే ఉంటది తప్ప కింద అడుక్కునే స్థాయికి దిగజారే మనస్తత్వం కాదని ప్రజలందరికీ తెలుసునన్నారు. మునుగోడు నియోజకవర్గంలో ఎంతో మంది అనారోగ్యంతో ఉన్న నిరుపేద ప్రజలకు సొంత డబ్బులతో హాస్పిటల్స్ లో చేర్పించి ఎంతోమంది ప్రాణాలు రక్షించిన వ్యక్తి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో తన సొంత నిధులతో పాఠశాలలను హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, పేద ప్రజలకు సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఇంటర్ మరియు 10వ తరగతి విద్యార్థులకు కళాశాల మరియు పాఠశాల స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. నాడు ఎమ్మెల్యేగా రాజ్ గోపాల్



రెడ్డి రాజీనామాతోనే చౌటుప్పలలో 100పడకల ఆసుపత్రి ప్రతి గ్రామంలో సిసి రోడ్లు ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ఇప్పటికైనా మీరు తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే నిన్ను ప్రజల్లో తిరగకుండా చేస్తారని గ్రహించాలన్నారు. అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావనిని కించపరిచే విధంగా మాట్లాడడం మీకు రాజకీయ అనుభవం ఎంత ఉందో అర్థమవుతుందో అర్థమవుతుందన్నారు. చైర్ పర్సన్ చైర్మన్ గురించి ఇప్పటికే తప్పుడు ఆరోపణలు చేసి మీ స్థాయిని దిగదార్చుకున్నారని ఆరోపించారు. వలిగొండ రోడ్డు లోని కల్వర్టు దగ్గరలో పిల్లలమర్రి మధుసూదన్ గారు నిర్మిస్తున్నటువంటి భవనం గురించి వివిధ కంప్లైంట్స్ కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పిల్లలమర్రి మధుసూదన్ కి ఇప్పటికే రెండు నోటీసులు మున్సిపల్ ఆఫీసు నుంచి జారీ చేసిన విషయం తెలుసుకోవాలన్నారు. ఎలాంటి తప్పు చేసిన మున్సిపల్ అధికారులు చూస్తూ ఊరుకోరని, ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే భవిష్యత్తులో మిమ్ములను మునుగోడు ప్రజలు మునుగోడు నియోజకవర్గంలో తిరుగనివ్వరని హెచ్చరించారు.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి.

అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.

- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబంద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

**1.ఆక్యుపేషనల్ థెరపీ:**
పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



**2.బిహేవియర్ థెరపీ:**
బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

**3. స్పీచ్ థెరపీ:**
ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.



# ఎండల్లో ఇలా చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి

ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతేకాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒక వేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.

2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.



# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు



**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.

అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

PRABHAS

సినిమా



# ప్చ్.. మరో ఛాన్స్ మిస్



ఒకప్పుడు చేతిలో ఐదారు సినిమాలతో టాలీవుడ్‌లోనే మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలుగొందింది శ్రీలీల. కానీ ఇప్పుడు ఆఫర్ల కోసం ఎదురుచూసే పరిస్థితి వచ్చింది. టాలీవుడ్‌లో కమ్‌బ్యాక్ కష్టంగా మారడంతో తమిళంతో పాటు బాలీవుడ్‌లపై దృష్టి సారిస్తోంది. అక్కడా ఈ అమ్మడిని బ్యాడ్‌లక్ వెంటాడుతోంది. ఈ ముద్దుగుమ్మ పేరు చెబితేనే హీరోలు భయపడిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. హీరోయిన్‌గా శ్రీలీలను రిజెక్ట్ చేస్తున్నట్లు సమాచారం. తాజాగా అజిత్ సినిమా ఆఫర్ కూడా చేజారినట్లు సమాచారం. ఒకే ఏడాది లెనిన్, అనగనగా ఒక రాజు సూపర్ హిట్ సినిమాలను ఈ చిన్నది మిస్సయ్యింది. ఇవే కాకుండా విజయ్ దేవరకొండ కింగ్డమ్, వరుణ్ ధావన్ బాలీవుడ్ మూవీ హై జవానీతో ఇష్క్ హోనా హై సినిమాల్లోనూ శ్రీలీలనే హీరోయిన్‌గా నటించాల్సి ఉండగా చివరి నిమిషంలో మేకర్స్ ఆమెకు షాకిచ్చారు.

## ఫౌజీ రిలీజ్ డేట్ వచ్చేసింది

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రభాస్ ఫౌజీ మూవీ రిలీజ్ డేట్‌పై బిగ్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ పాన్ ఇండియన్ మూవీని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. గురువారం ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా అందులో ప్రభాస్ యుద్ధభూమి లో వీరుడిగా కనిపిస్తున్నారు. అతడి చుట్టూ వందలాది శవాలున్నాయి. ప్రభాస్ చేతిలో పాత కాలం నాటి తుపాకీ ఉంది. ఒంటరిగా పోరాడే ఓ సైనికుడు అంటూ పోస్టర్‌పై ఉన్న క్యాప్షన్ ఆసక్తిని పంచుతోంది. ఆ పక్కనే మోస్ట్ వాంటెడ్ సీన్స్ 1932 అనే స్టాంప్ ఉండటం ఆకట్టుకుంటోంది. ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తుండగా విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తోంది. తెలుగుతో పాటు మరో నాలుగు భాషల్లో రిలీజ్ కాబోతుంది.



## మరోసారి మెగా హీరో మూవీలో..

సినీ ఇండస్ట్రీలో తండ్రి కొడుకులతో కలిసి ఓ హీరోయిన్ సినిమా చేయడం అన్నది అరుదు. ఇప్పుడు లేడీ సూపర్ స్టార్ నయనతారకు అలాంటి అవకాశమే దక్కిందట. మన శంకర వరప్రసాద్‌గారు తర్వాత తెలుగులో మరో భారీ బడ్జెట్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందట. ఈసారి కూడా మెగా హీరోతోనే సినిమా చేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. సుకుమార్ డైరెక్షన్‌లో రామ్‌చరణ్ ఓ సినిమా చేయబోతున్నారు. స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఆర్‌సీ 17 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో నయన్ ఓ హీరోయిన్‌గా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. చరణ్‌కు జోడీగా కాకుండా కథను మలుపుతిప్పే ఓ కీలక పాత్రలో ఆమె కనిపిస్తుందని అంటున్నారు. చరణ్‌తో సమానంగా ఆమె పాత్ర తాలూకు స్క్రీన్ టైమ్ ఉంటుందట. ఆగస్ట్ లేదా సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

# ఓటీటీలోకి పళ్లిచట్టంబి

కయదు లోహర్ హీరోయిన్‌గా నటించిన మలయాళం మూవీ పళ్లిచట్టంబి ఓటీటీ రిలీజ్ డేట్ ఎట్టకేలకు కన్ఫామ్ అయ్యింది. థియేటర్లలో రిలీజైన మూడు నెలల తర్వాత సోనీలివ్ ఓటీటీలోకి రాబోతుంది. టోవినో థామస్ హీరోగా నటించిన ఈ పీరియాడికల్ యాక్షన్ మూవీ జూలై 24 నుంచి సోనీ లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతుంది. మలయాళంతో పాటు తెలుగులోనూ రిలీజ్ అవుతోంది. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించగా జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందించాడు. మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ అతిథి పాత్రలో కనిపించారు. 1950 దశకంలో కేరళ ప్రభుత్వం భూ సంస్కరణల బిల్లు, హిందువు అయిన కృష్ణ పిళ్లై.. పోతన్ క్రిస్టోఫర్‌గా ఎలా మారాడు? రెబెక్కాతో అతడి ప్రేమాయణం వంటి అంశాలతో ఈ మూవీ తెరకెక్కించారు. దాదాపు 50 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ థియేటర్లలో 20 కోట్లలోపే వసూళ్లను దక్కించుకుంది. ఈ ఏడాది మలయాళంలోనే బిగ్గెస్ట్ డిజాస్టర్స్‌లో ఒకటిగా నిలిచింది.





## సోనమ్ దీక్షకు దీపికా సపోర్ట్.. నిజమేనా?

నీట్ పేపర్ లీకేజీపై సోనమ్ వాంగ్ చుక్ నిరాహార దీక్షకు స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణ్ మద్దతు ప్రకటించిందంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. "సోనమ్ దీక్ష గురించి మాట్లాడటానికి అందరూ ఎందుకు భయపడుతున్నారు. న్యాయం కోసం ఉపవాసం చేస్తున్నారు. మనమేమో సోషల్ మీడియాలో స్క్రోల్స్ చూస్తూ, పోస్ట్‌లు పెడుతూ ఏం పట్టనట్లుగా ఉంటున్నాం. ఓ విఫల నాయకుడిని గొప్పగా చూపిస్తూ ఎన్నో సినిమాలు వస్తున్నాయి. వాటివల్ల వాస్తవాలు మారిపోవు"అంటూ దీపికా తన పోస్ట్‌లో పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. విమర్శలు రావడంతో పోస్ట్‌ను డిలీట్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. దీనిపై ఆమె రియాక్ట్ అవుతుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.